అప్పన్న పులిహోర ప్రసాదంపై వార్తల్లో వాస్తవం లేదు

- విచారణకై పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో భక్తులకు అందజేసే పులిహోర ప్రసాదంపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు కేవలం అవాస్తవాలని, దురుద్దేశపూర్వకమని దేవస్థాన అధికారులు స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పులిహోర తయారీలో వాడే ప్రతి వస్తువును (మిర్చి, ఆవాలు, శనగపప్పు మొదలైనవి) అత్యంత జాగ్రత్తగా శుభ్రపరిచిన తర్వాతే వినియోగిస్తారు. తయారీ సమయంలో ప్యాకింగ్ చేసేటప్పుడు ప్రసాదాన్ని నిరంతరం పర్యవేక్షిస్తారు. ప్రసాదం తయారీ విభాగంలో పనిచేసే సిబ్బంది గత 30 ఏళ్లుగా అనుభవం ఉన్నవారని, ఎన్నడూ ఇలాంటి పొరపాట్లు జరగలేదని దేవస్థానం వివరించింది. ప్రసాదంలో పురుగు ఉందని చూపిస్తున్న వీడియోను పరిశీలిస్తే, పులిహోరను బాగా వేడి చేసిన తర్వాతే పంపిణీ చేయడం జరుగుతుందని, అంతటి వేడిలో పురుగు సజీవంగా ఉండే అవకాశం లేదని నిపుణులు, సిబ్బంది పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోను లోతుగా పరిశీలించగా, సదరు వ్యక్తులు ప్రసాదం ప్యాకెట్ కొనుగోలు చేసిన తర్వాత బయటకు వెళ్లి, కొంత సమయం తర్వాత తిరిగి వచ్చి పురుగు ఉందని చూపించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీసేందుకు, భక్తుల మనోభావాలను గాయపరిచేందుకు ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు భావిస్తున్నామన్నారు. వేలాది మంది భక్తులకు అందించే ప్రసాదం విషయంలో దేవస్థానం ఎంతో భక్తిశ్రద్ధలతో, శుచితో వ్యవహరిస్తుందని, ఇలాంటి నిరాధారమైన వార్తలను నమ్మవద్దని అధికారులు కోరారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫోక్సో కేసులు తగ్గించేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో ఫోక్సో కేసులు తగ్గించాలంటే అన్ని శాఖలు మహిళా, శిశు సంక్షేమ శాఖతో సమన్వయంతో పని చేయాలని, అప్పుడే ఆశించిన మేర ఫలితాలు సాధించగలమని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. పిల్లలపై జరిగే లైంగిక నేరాలలో అధిక శాతం కుటుంబ సభ్యులు లేదా పరిచయస్తుల ద్వారానే జరుగుతున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం శ్రద్ధ వహించాలని అన్నారు. ఫోక్సో కేసులు త్వరితగతిన పరిష్కారానికి పోలీసు శాఖ, వైద్య శాఖల సమన్వయం కీలకమని అన్నారు. దర్యాప్తు ప్రక్రియ వేగవంతం చేయడంతోపాటు కచ్చితమైన, సమయానుకూల ఫోరెన్సిక్ నివేదికలను వైద్య శాఖ అందిం చాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, గ్రామస్థాయిలో పిల్లలకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం అమలు, ఇతర అంశాలపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం జరిగిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవోఎంఎస్ 28 ప్రకారం ఫోక్సో బాధితులకు పరిహారం మంజూరు చేస్తున్నామని, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా బాధితులకు కౌన్సెలింగ్ వైద్య సేవలు అందిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది అన్నయ్యబాబు, సైకాలజిస్ట్ డా. నిత్య, జిల్లా స్థాయి అధికారులు, పోలీసు, వైద్య శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, క్రమశిక్షణే ముఖ్యం

సీపీ డా. శంఖబ్రత బాగ్చి

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బుధవారం నగర ఆర్మడ్ రిజర్వ్ మైదానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇన్ స్పెక్షన్ పరేడ్‌ను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరేడ్ వాహనంలో తిరుగుతూ సిబ్బంది 'టర్న్ ఔట్' (దుస్తులు, ఆహార్యం)ను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బంది ప్రదర్శించిన కింది విన్యాసాలను ఆయన అభినందించారు. లాఠీ డ్రిల్, ఆర్మ్స్ డ్రిల్, బ్యాండు ప్రదర్శన. ఆయుధాలను వేగంగా విడదీయడం తిరిగి అమర్చడం వంటి నైపుణ్యాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ పనితీరును, వాటి శిక్షణను అడిగి తెలుసుకున్నారు. పరేడ్ అనంతరం సిబ్బందితో కమిషనర్ 'దర్బార్' నిర్వహించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను, వినతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నా లేదా సలహాలు ఇవ్వాలనుకున్నా నేరుగా తన వ్యక్తిగత నంబరు 79950 95799కు సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. వచ్చే ఏడాది (2026) నగరంలో అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాలు జరగనున్నాయని, వాటన్నింటినీ విజయవంతం చేసేందుకు సిబ్బంది మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. చివరగా పోలీస్ కుటుంబ సభ్యులందరికీ కమిషనర్ ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సమాచార శాఖ ఉద్యోగి ఖాదర్ బాబా సేవలు ప్రశంసనీయం

ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సమాచార పౌర సంబంధాల శాఖలో పని చేసిన నాలుగో తరగతి ఉద్యోగి అయిన కార్యాలయ సహాయకుడు ఖాదర్ బాబా సేవలు ప్రశంసనీయమని ఆ శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ అన్నారు. కచ్చితమైన సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పని చేశారని పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖలో 1986 సెప్టెంబర్ 01న పార్ట్ టైం అటెండర్‌గా చేరి వివిధ కార్యాలయాల్లో 39 సంవత్సరాల పాటు సేవలందించి బుధవారం పదవీ విరమణ పొందిన సందర్భంగా స్థానిక సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. జోన్ -1లో పని చేస్తున్న ఉన్నతాధికారులు, కింది స్థాయి సిబ్బంది కార్యక్రమానికి హాజరై ఖాదర్ బాబా అందించిన సేవలను కొనియాడారు. అనంతరం దుశ్శాలువా, పుష్ప గుచ్చాలు అందజేసి దంపతులను సత్కరించారు. జనవరి నెల నుంచే పింఛను అందుకునే విధంగా సిద్ధం చేసి తక్షణ మంజూరు పత్రాలను వీడ్కోలు సభలోనే ఆర్జేడీ వి.మణిరామ్, డీడీ కె.సదా రావులు ఖాదర్ బాబాకు అందజేశారు. కార్య క్రమంలో అనకాపల్లి డీఐపీఆర్వో ఎస్.వి.రమణ, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఎ.బాబ్జీ, సెట్విస్ సీఈవో రమ్య, సూపరింటెండెంట్ సుధాకర్, సమాచార శాఖ సూపరింటెండెంట్ జీవీకె ప్రసాద్, డివిజనల్ పీఆర్వోలు డి.నారాయణరావు, ఐ.శ్రీని వాసరావు, సహాయ సమాచార ఇంజనీర్లు రామకృష్ణ, సీహెచ్.బాలాజీ, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ కె.వెంకటరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు, ఆర్జేడీ, డీడీ, ఆర్.ఐ.ఈ. కార్యాలయాల సిబ్బంది, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, జోన్-1 పరిధిలోని ఆయా జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

విశాఖలో డ్రగ్స్ కలకలం

ఐదు కిలోల గంజాయి, ఎండీఎంఏ స్వాధీనం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా ఎంవీపీ కాలనీ పరిధిలోని లాసన్స్ బే జంక్షన్ వద్ద భారీగా గంజాయి, డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో డ్రగ్స్ సరఫరా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో లాసన్స్ బే జంక్షన్ వద్ద ఒకే స్కూటీపై అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అడ్డుకున్నారు. వారిని తనిఖీ చేయగా సుమారు 5 కిలోల గంజాయి, 5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకులు చోడవరం, అనకాపల్లి, ఇసుకతోట ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేసి ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

గీతంలో గిరిజన యువ సమ్మేళనం ప్రారంభం

విశాలాంధ్ర - మధురవాడ: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 17వ గిరిజన యువ సమ్మేళనం కార్యక్రమం బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా ప్రారంభమైంది. ఝార్ఖండ్, ఛత్తీస్‌గడ్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన గిరిజన యువత ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన మై భారత్ (నెహ్రూ యువకేంద్ర సంఘటన్) ఆంధ్రప్రదేశ్ -తెలంగాణ రాష్ట్ర డైరక్టర్ అంసుమన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ ఛత్తీస్‌గడ్, ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లోని వామపక్ష తీవ్రవాద ప్రభావిత (ఎల్‌డిబ్ల్యూఈ) ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన యువతకు దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూపించడానికి ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ అవకాశాలను తెలియజేయడానికి యువ సమ్మేళనం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైభారత్ (నెహ్రూ యువకేంద్ర సంఘటన్) విశాఖపట్నం ఉప డైరక్టర్ జి.మహేశ్వరరావు, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) కమాండెంట్ సురజ్ ప్రకాశ్ జోషి, హెచ్.పి.సి.ఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ జనరల్ మేనేజర్ పి.విజయకుమార్, వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి రెహామున్నిసా బేగం, గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.జి.రెడ్డి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత లీలాప్రసాద్, సెట్విస్ అధికారి ఎమ్.రమ్య, సీనియర్ పాత్రికేయుడు ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర - వన్‌టౌన్: దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. సీతంపేట కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో గత 18 నెలలో 50 కోట్లుతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రూ.120 కోట్లుతో పూర్ణమార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ దక్షిణ నియోజక వర్గంలో దేవాదాయ శాఖకు సంబంధించి సమస్యలున్నాయని, ఈ సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామన్నారు. నియోజక వర్గంలో లాండ్ ఆర్డర్ పై ప్రత్యేక దృష్టి పెట్టి అదుపు చేసామన్నారు. గంజాయిని పూర్తి స్థాయిలో అరికట్టామని, మార్కెట్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. జైల్ రోడ్‌లో నైట్ ఫుట్ కోర్టులో అన్ ఆథరైజ్డ్ షాపులు ఉండడం వలన తొలగించడం జరిగిందని, మరల విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 6 కోట్లుతో నైట్ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేస్తున్నామన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగం వచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో జనసేన పార్టీ నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, జనసేన పార్టీ యువనేత డాక్టర్ మత్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా సుడిగాలి పర్యటన



విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక నియోజక వర్గాన్ని మోడ్రన్ సిటీగా తీర్చి దిద్దుతామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పలు వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన నేరుగా పరిశీలించారు. సమతానగర్ జంక్షన్ వైడ్ చేసి ఐ ల్యాండ్‌గా మార్చాలని అధికారులకు సూచించారు. అలాగే జగ్గూ జంక్షన్ నుండి కే.కే.ఆర్ వాటర్ ప్లాంట్ వైపు ఉన్న రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజ్ వేసి, ఫుట్ పాత్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 76వ వార్డులో కోట్లాది రూపాయలతో నిర్మాణం జరుగుతున్న ప్రధాన గెడ్డలు అభివృద్ధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంథం శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శ్రీధర్, రాయలు బాబు, ప్రసాదుల శ్రీను, ప్రెసిడెంట్ జిత్తుక రాజు, శివ, శ్రీధర్, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మ్యాజిక్ షో

విశాలాంధ్ర - తగరపువలస: విద్యార్థులకు విద్యతోపాటు మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు గాను తగరపువలస సాయి రవీంద్ర స్కూల్, శ్రీ రామకృష్ణ విద్యాలయంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ మెజీషియన్ జాతీయ అవార్డు గ్రహీత శ్రీనివాస్ పండిట్‌చే మేజిక్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ మేజిక్ షో ద్వారా వచ్చిన డబ్బును తాళ్లవలసలో గల భరోసా లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రం పిల్లల ఖర్చుల నిమిత్తం ఇస్తామని సొసైటీ అధ్యక్షులు వెంపాడ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి రవీంద్ర స్కూల్ కరెస్పాండెంట్ బొగేల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రసి సతీష్, రామకృష్ణ, విద్యాలయం స్కూల్ కరస్పాండెంట్ మానపురం సాయి కుమార్, శ్రీను పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డు పరిధి రిక్షా కాలనీకి చెందిన వార్డు తెలుగు యువత కార్యదర్శి దుక్క గోవింద్‌కి గత కొన్ని రోజుల కిందట యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగి ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది. ఈ పరిస్థితులలో సుమారు 80వేలు రూపాయలు

వరకు ఖర్చులు కాగా ఈ విషయం జీవీఎంసీ 6వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి లొడగల జానకిరామ్ ద్వారా మాజీ మంత్రి, భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యువ నాయకులు గంటా రవితేజల దృష్టికి తీసుకువెళ్ళగా వెంటనే స్పందించి మంజూరయ్యేలా కృషి చేశారు. 38వ వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే గంటా దుక్క గోవింద్‌కు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గరే గురునాథ్, వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి లొడగల జానకిరామ్, వార్డు యువత అధ్యక్షులు నక్క రమణ, బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, యువత ఉపాధ్యక్షుడు బమ్మిడి చిన్న పాల్గొన్నారు.

వీపీఏలో రోడ్ స్వీపింగ్ మెషిన్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, అగ్నిమాపక కేంద్రంలో నూతనంగా సమకూర్చుకున్న రోడ్ స్వీపింగ్ మెషిన్, మల్టీపర్పస్ ఫైర్ టెండర్‌ను బుధవారం పోర్ట్ డిప్యూటీ చైర్ పర్సన్ రోష్ని అపరాంజి కొరాటి ప్రారంభించారు. రూ.3.85 కోట్ల వ్యయంతో సమకూర్చుకున్న మల్టీపర్పస్ ఫైర్ టెండర్ లో 6 కిలోలీటర్ల నీటి ట్యాంక్, 200 లీటర్ల ఫోమ్ కంపౌండ్, 100 కిలోల డ్రై కెమికల్ పౌడర్ (డీసీపీ), 45 కిలోల కార్బన్ డయాక్సైడ్‌తోపాటు అత్యవసర పరిస్థితుల కోసం అవసరమైన ఆధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. ఇక రోడ్ స్వీపింగ్ మెషిన్‌ను పోర్ట్ పరిధిలోని అంతర్గత రహదారులపై ఏర్పడే దుమ్ము, చెత్త, స్పిల్లేజ్ తదితరాలను శుభ్రం చేయడానికి

వినియోగించనున్నారు. రూ.4.69 కోట్ల వ్యయంతో ఈ యంత్రాన్ని కొనుగోలు చేయగా, 36 నెలల కాలానికి వార్షిక నిర్వహణ పొందుపరచబడి ఉంది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ యంత్రం గంటకు 20,000 క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో అన్ని దిశల్లో శుభ్రపరిచే సామర్థ్యం కలిగి ఉంది. పోర్టులో ఇప్పటికే అందుబాటులో ఉన్న, మూడు రోడ్ స్వీపింగ్ యంత్రాలకు అదనంగా ఇది చేరింది. ఈ కార్యక్రమంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అరుణ్ ప్రసాద్, పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ కంటైనర్ పార్లర్ ప్రారంభం

విశాలాంధ్ర - పద్మనాభం: మద్ది జంక్షన్‌లో మంగళవారం విశాఖ డెయిరీ కంటైనర్ పార్లర్‌ను విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. దీంతో 68డెయిరీ పార్లర్‌లు ఉన్నట్టు తెలిపారు. దీనివల్ల ఈ ప్రాంతంలో ఉన్న రైతులకు, ప్రజలకు స్వచ్ఛమైన డెయిరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంసీసీ డైరెక్టర్ కోళ్ల కాటమయ్య, డెయిరీ సీఈఓ కెవి ప్రసాద్, మేనేజర్ కె.వేణుగోపాల్, ఎంపీపీ రాంబాబు, టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు నగేష్‌కుమార్, అధ్యక్షులు ప్రకాష్, సూపర్‌వైజర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో మేమున్నామంటూ భరోసా

ఓఎస్‌జీ ఫౌండేషన్ ఫౌండర్ శివ దళాయి

విశాలాంధ్ర - ఆనందపురం: ఓఎస్‌జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివ దళాయి అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2025 సంవత్సరంలో అనేక రక్తదాన శిబిరాలు, స్వచ్ఛంద కార్యక్రమాలు సేవ దృక్పథంతో అనేక మంది పేదవారికి మేమున్నామంటూ ముందుకు వస్తూ వాళ్ళ కష్టసుఖాలలో తోడుగా ఉంటున్నారు. కొంతమంది దాతల సహాయ సహకారాలతో

పేదవారికి వైద్యం అందిస్తూ నిరంతరం శ్రమిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా అందరి మనసులను గెలుచుకొనీ మన్నలను పొందుతూ ఓ ఎస్ జి ఫౌండేషన్ ద్వారా సాయం అందుతుందని పేదవారు ఎదురుచూస్తున్న రీతిలో సాయం చేస్తున్నారు, గడచిన సంవత్సరంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు ఎంతోమంది అభాగ్యులకు అండగా నిలిచి, సాయం చేశారు, అటువంటి ఓ ఎస్ జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివ దళాయి ను ప్రత్యేకంగా అభినందించాలని కోరుతున్నారు.

అమ్మా..పెన్షన్ సక్రమంగా అందుతుందా..!: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెందుర్తి: అమ్మా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సక్రమంగా అందుతోందా అంటూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆప్యాయంగా పలకరించారు. జీవీఎంసీ 95వ వార్డు గొల్లవెల్లివానిపాలెం కాలనీలో పలువురు లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్ మొత్తాన్ని అందజేసి, వారి సాదక బాదకాలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతాయని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో ఒకరోజు ముందుగానే డిసెంబర్ నెల

పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ గంగాధర్, బీజేపీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త గొర్లె రామునాయుడు, పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం, జనసేన సీనియర్ నాయకులు సుధాకర్ రాజు, సీహెచ్‌సీ డైరెక్టర్ బండారు వరుధిని నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ నాయుడు, జనసేన వార్డు అధ్యక్షులు కంచిపాటి మధు, పిన్నింటి పార్వతి, 95వ వార్డు టీడీపీ వార్డు ఉపాధ్యక్షుడు కంచిపాటి హరి, జనసేన మహిళా కో ఆర్డినేటర్ మంతా నాగసుధ, లక్ష్మీ గోవింద్, గ్రామ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వారి అవసరాలను తీర్చడమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి సర్కార్ పనిచేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక ఫించన్ పంపిణీ కార్యక్రమంలో భీమిలి జోనల్ కమీషనర్ టి. నాగేంద్రకుమార్‌తో కలిసి గంటా నూకరాజు పాల్గొన్నారు. భీమిలి జోన్ 3వ డివిజన్ గొల్లలపాలెం, రెల్లివీధిలో జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు ఫించన్లు పంపిణీ చేశారు. యువతకు ఉపాధి - ఉద్యోగ అవకాశాలు,

మహిళలకు భద్రత, పిల్లలకు సంరక్షణ ప్రధాన అంశాలుగా పరిపాలన సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, టీడీపీ నాయకులు చురకల రమణ, జలగడుగుల మురళి, నెక్కెళ్ళ వెంకటరావు, వియ్యపు పోతురాజు, కుప్పిల గురు మూర్తి, ఆవాల సూరిబాబు, అల్లిపిల్లి సతీష్, వియ్యపు నాయుడు, రేగాని శంకర్, ప్రభాకర్, సత్యన్నారాయణ రెడ్డి, నొల్లి, సతీష్, రాజు, పీతల వెంకటరావు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏలో భారీగా బదిలీలు

విశాలాంధ్ర - విశాఖ: వీఎంఆర్‌డీఏలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. పరిపాలనాధికారులు (ఏఓలు), సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పెద్ద ఎత్తున స్థానాలు మారారు. ఆరుగురు ఏఓలను బదిలీ చేశారు. ఏఓలో మేనేజర్‌గా ఉన్న నాగభూషణం, ఇంజనీరింగ్ - కె.విజయలక్ష్మి, ప్లానింగ్ - కె.రాజశేఖర్, ప్లానింగ్ -సీహెచ్.వెంకటేశ్వరరావు, రెవెన్యూ - పి.హేమంత్ కుమార్, లీగల్ - జీవీ రమణారావులను బదిలీచేశారు. 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక వర్క్ ఇన్‌స్పెక్టర్, 24 మంది డీటీపీ ఆపరేటర్లు బదిలీ అయ్యారు. ఇంజనీరింగ్ నుంచి ఎనిమిది మంది డీటీపీ ఆపరేటర్లను మార్చారు.

తుపాను కేంద్రం నుండి ఐటీ జంక్షన్ రోడ్డుకు ఆర్‌డీపీ జరగలేదు

విశాలాంధ్ర వార్తకు వీఎంఆర్‌డీఏ అధికారుల వివరణ

విశాలాంధ్ర - విశాఖ: మధురవాడలో తుపాను రక్షిత కేంద్రం భవనం నుంచి ఐటీ జంక్షన్ వరకూ రహదారి అభివృద్ధి ప్రణాళిక (ఆర్‌డీపీ)ని జీవీఎంసీ పూర్తిచేసి, వీఎంఆర్‌డీఏకి అప్పగించాల్సి ఉందని అందువల్ల ఆ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు జరగలేదని, అంతే తప్ప ఈ రోడ్డును వ్యాంబే కాలనీ మీదుగా మళ్ళించలేదని తెలిపారు. వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ వి.భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్రలో 'కూటమి నేతల మాస్టర్ ప్లాన్' కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. జీవీఎంసీ అధికారులు రహదారి అభివృద్ధి ప్రణాళిక 6/2018 ద్వారా మధురవాడ జంక్షన్ నుంచి తుపాను రక్షణ కేంద్రం భవనం.. 900 మీటర్ల వరకూ మాత్రమే 80 అడుగుల రహదారిని ప్రతిపాదించారని తెలిపారు. ఈ రోడ్డులో ఒక వైపు 40 అడుగుల వరకూ రోడ్డు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం ముందుగానే పూర్తిచేశామని తెలిపారు. మరోవైపు 40 అడుగుల రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. టీడీఆర్ ల జారీ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి చేయనందున రహదారి పనులు అనుకున్నంత వేగంగా జరగడంలేదని తెలిపారు. మిథిలాపురి రోడ్డు నుంచి వాంబే కాలనీ మీదుగా తుపాను రక్షిత కేంద్రం భవనం వరకూ 1200 మీటర్ల పొడవు 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రహదారి చాలా రోజుల నుండి ప్రతిపాదనలో ఉందన్నారు. దీని ప్రాధాన్యత దృష్ట్యా జీవీఎంసీ ఇప్పటికే మొదటి 400 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తిచేసిందన్నారు. మిగిలిన రహదారి కోసం ఆర్‌డీపీ 14/2018ని జీవీఎంసీ పూర్తిచేసి వీఎంఆర్‌డీఏకి అప్పగించిందన్నారు. ఈ భాగం నిర్మాణం చేపట్టామని తెలిపారు. త్వరలో ఈ రహదారులను అందుబాటులోకి తెస్తామన్నారు.

నిత్యాన్న ప్రసాదానికి రూ.5 లక్షలు విరాళం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్యాన్న ప్రసాద పథకానికి లక్ష రూపాయలు విరాళంగా భక్తులు సమర్పించారు. విశాఖ, పాండురంగపురం వాస్తవ్యులు పి.ఏ.అభిలాస్, దివ్య దంపతులు నిత్యాన్న ప్రసాద పథకానికి 5,00,000/- విరాళం పర్యవేక్షణ అధికారి లక్ష్మణరావుకు అందజేశారు. ఆలయ మర్యాదలు ప్రకారం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్నా 9491000635కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జీవీఎంసీలో 8 మంది మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నియమకం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు సంబం ధించిన కోర్టు కేసులు పరిష్కరించేందుకు, న్యాయపరమైన సేవలు అందించేందుకు నూతనంగా నియమించబడిన మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కృషి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో నూతనంగా నియమించబడిన మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులైన లగుజ భారతి, దొడ్డి చంద్ర శేఖర్, అప్పారి వెంకట గిరి బాబు, నెల్లి పైడి రాజు, కారి గోవింద రాజు, మిడతాన శాంతమ్మ, పోలవరపు అప్పల రాజు, నాలి శేషు కుమార్ లు మర్యాదపూర్వకంగా నగర మేయర్‌ను కలిశారు. నగర మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీలో నూతనంగా నియమించబడిన జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు జీవీఎంసీ ఆస్తులను కాపాడేందుకు, అలాగే జీవీఎంసీ పై ఉన్న కోర్ట్ కేసులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కృషి చేసి జీవీఎంసీ ఆస్తులను కాపాడాలని కోరారు. జీవీఎంసీ అభివృద్ధికి న్యాయపరమైన సేవలను, సలహాలను, సూచనలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, పర్యవేక్షకులు ఈటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బొకేలు, స్వీట్లు వద్దు... సంజీవని నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని పరస్పర శుభాకాంక్షలు తెలిపే క్రమంలో పూల బొకేలు, స్వీట్లు కాకుండా పేదలకు, అనారోగ్య బాధితులకు ఉపయోగపడే విధంగా నెలకొల్పిన సంజీవని నిధి - డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్‌కు స్వచ్ఛంద విరాళాలు అందించాలని, అధికారులు, దాతలకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అధికారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు పరస్పరం శుభాకాంక్షలు తెలపడం సందర్భంగా పూలు, పండ్లు, కేకులు, మొక్కలు తదితరాలను అందించడం కన్నా.. 'సంజీవని నిధి - జిల్లా సహాయ నిధి'కి స్వచ్ఛంద విరాళాలు అందించటం మేలని జిల్లా ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, వారి లక్ష్యాలను, ఆశయాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆయుష్షు, ఆనందాన్ని కలుగజేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడంతో 2026 సంవత్సరం జిల్లా అభివృద్ధిని మలుపు తిప్పే సంవత్సరంగా రూపొందబోతోందన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే దిశగా ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలు సత్ఫలితాలు సాధించి అందరి జీవితాల్లో కొత్త సంవత్సరం నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో గురువారం ఉదయం 9.30 గంటల నుంచి అందుబాటులో ఉంటారని కలెక్టర్ పేషీ తెలిపింది.

బాధితులకు నూతన సంవత్సర కానుక

351 వాహనాలను అప్పగించిన విశాఖ సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ నేతృత్వంలో బుధవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో భారీ 'వాహనాల హ్యాండ్ ఓవర్ మేళా' నిర్వహించారు. వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న లేదా చోరీకి గురై రికవరీ చేసిన వాహనాలను యజమానులకు అందజేశారు. ఈ మేళాలో మొత్తం 351 వాహనాలను బాధితులకు అప్పగించారు. సీపీ మాట్లాడుతూ ఇప్పటివరకు ఇలాంటి కార్యక్రమాన్ని నాలుగు దఫాలుగా నిర్వహించామని, ఇది ఐదవ విడత అని వెల్లడించారు. వాహనాలను రికవరీ చేయడంలో చురుగ్గా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు. ప్రయాణాల్లో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నత స్థాయి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోగొట్టుకున్న ఆస్తులను తిరిగి అప్పగించడంలో విశాఖ పోలీసులు చూపుతున్న చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

2026లో నగర సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగర ప్రజలందరికీ జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025 లో సాధించిన ప్రగతిని, లక్ష్యాలు మననం చేసుకుంటూ, లోపాలను సవరించుకొని 2026 లో విశాఖ నగర సమగ్ర ప్రగతిని నిర్దేశించుకుని లక్ష్యసాధనకు సమిష్టిగా కృషి చేస్తామని తెలియపరుచుచున్నాము. విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నగరంలో అన్ని వార్డులలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం జరిగింది. మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 8 జోనులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 10 జోనులుగా అనగా భీమునిపట్నం జోన్, మధురవాడ జోన్, ఈస్ట్ జోన్, నార్త్ జోన్, సౌత్ జోన్, వెస్ట్ జోన్, పెందుర్తి జోన్, గాజువాక జోన్, అగనంపూడి జోన్, అనకాపల్లి జోనులుగా పునర్వ్యవస్థీకరణ చేస్తూ 1వ తేదీ జనవరి 2026 నుండి ఆయా జోనులలో కార్యకలాపాలు, సేవలు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. జీవీఎంసీ అభివృద్ధి పనులలో భాగంగా 2024-25 సంవత్సరంలో జీవీఎంసీ పరిధిలో 338.92 కోట్ల అంచనాలతో 1628 పనులను చేపట్టగా 1303 పనులను 221.22 కోట్లతో పూర్తి చేయగా మిగిలినవి వివిధ దశలో ఉన్నవి. 2025-26 సంవత్సరంలో 657.39 కోట్ల అంచనాలతో 1667 పనులను చేపట్టగా 486 పనులను 82.75 కోట్లతో పూర్తి చేయగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. విశాఖ నగర అభివృద్ధి దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ మేరకు విశాఖ నగరంలో జీవీఎంసీ పి.పి.పి. హెచ్.ఎ.ఎమ్ క్రింద 306.95 కోట్ల ఖర్చుతో 88.35 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రతిపాదించబడిందన్నారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు: విశాఖ నగరంలో వీధివిక్రయదారుల కొరకు, ఎస్ హెచ్ జి మహిళల జీవనోపాధిని మెరుగుపరుచుటకు ప్రస్తుతం మూడు స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లను మధురవాడ జోన్, ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ సమీపంలో సౌత్ జోన్ సెంట్రల్ పార్కు సమీపంలో, గాజువాక జోన్ దువ్వాడ ఫ్లై ఓవర్ వద్ద 14 కోట్ల అంచనా వ్యయంతో మాడ్యులర్ కంటైనర్ మోడల్ లో అన్ని మౌలిక సదుపాయాలతో 250 వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయబడుతున్నాయన్నారు. కాపులప్పాడలో బయోమైనింగ్ పద్ధతి ద్వారా 11.32 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను రీమీడియట్ చేసి 33.50 ఎకరాల భూమిని పునరుద్ధరించి 2000 మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ఉపయోగించే కార్యక్రమాలను రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. జివిఎంసి యంత్రాంగ విశేష కృషితో స్వచ్ఛ సర్వేక్షన్ 2024వ సంవత్సరమునకు గాను జాతీయస్థాయిలో సఫాయిమిత్ర సురక్షిత్ షహర్ ప్రత్యేక కేటగిరీలో జీవీఎంసీకి ప్రథమ స్థానం దక్కిందని, 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో జీవీఎంసీకి మూడు ప్రతిష్టాత్మక పి.ఆర్.ఎస్.ఐ-2025 జాతీయ అవార్డులు పొందినట్లు తెలిపారు.

పింఛన్లను పంపిణీ చేసిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లతోనే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీరకాలిక రోగులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఆర్థిక భరోసా కలుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పెందుర్తి జోన్ 96వ వార్డు పరిధిలోని రాతి చెరువు ప్రాంతంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలతో పాటు దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కనీస అవసరాలు తీర్చుకోలేని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక రోగులకు చంద్రబాబు అండగా ఉంటూ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఏపిడి, వార్డ్ సచివాలయం కార్యదర్శి, 96వ వార్డు ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, వార్డ్ యువత అధ్యక్షుడు జితేంద్ర, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం పులిహోర ప్రసాదంలో నత్త

దాన్ని ప్రశ్నించిన వారిపైనే కేసులా...?

వైసీపీ నేత కె.కె.రాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సింహాచలం అప్పన్న ఆలయంలో పులిహోర ప్రసాదంలో నత్త రావడంపై ప్రశ్నించిన భక్తులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం అత్యంత దారుణమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. వైసీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి వైఫల్యాలతో రాష్ట్రంలో ఇప్పటికే అన్ని ప్రధాన వ్యవస్థలు నిర్వీర్యం కాగా ఆలయాల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఆలయాలను రాజకీయాలకు వేదిక చేయడంతో ఈ దుస్థితి దాపురించిందన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డులో బుధవారం పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పాల్గొని అందజేశారు. కొత్తగా మంజూరు అయినా పింఛన్లు నేరుగా ఆయన పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఒకరోజు ముందుగానే తెల్లవారు సరికి పింఛన్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు జిత్తుక అప్పల రాజు, బిజెపి నాయకులు జిలకర రమణ, జనసేన నాయకులు ముమ్మన మురళి, శివ, బొడ్డు సత్యారావు, కుమార్, రమేష్, నారాయణ, సురేష్ కూటమి నాయకులు మహిళలు పాల్గొన్నారు.

విశాఖ పోలీస్ శాఖలో పదవీ విరమణ వేడుకలు

ఏడుగురు సిబ్బందికి సి.పి. వీడ్కోలు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: నగర పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేసిన ఏడుగురు పోలీసు అధికారులను నగర పోలీస్ కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఈ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పదవీ విరమణ పొందిన వారిలో ఎస్.కె.మజీద్ సాహెబ్ (ఏ ఆర్ ఎస్ ఐ), పి.మాధవరావు (ఏఎస్ఐ), టి.నారాయణరావు (ఏ ఆర్ హెచ్ సి), ఎం.శామ్యూల్ (హెచ్ సి), ఎస్. శ్రీనివాసరావు (హోం గార్డ్), పి.వి.వి.ఎస్. బాలాజీ రావు (హోం గార్డ్), వి.గణపతిరావు (హోం గార్డ్)ను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ కాలం నిబద్ధతతో సేవలు అందించడం సామాన్యమైన విషయం కాదని, విధి నిర్వహణలో వారు చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

నేడు వైసీపీ కార్యాలయంలో న్యూ ఇయర్ వేడుకలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైఎస్ఆర్సిపి భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు జరుగుతాయని మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, వార్డ్ అధ్యక్షులు, వార్డ్ కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, నియోజకవర్గ కమిటీ, మండల కమిటీలు మన నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులు ,కార్యకర్తలు ,అందరూ హాజరుకావాలని ఆనందపురం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపార్టీ అధ్యక్షులు బంక సత్యం తెలిపారు.



స్వచ్ఛ రథం ఆపరేటర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పొడి చెత్త నిర్వహణను మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న "స్వఛ్ఛ రథం" కార్యక్రమం కింద స్వఛ్ఛ రథం ఆపరేటర్ల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, విధివిధానాల ప్రకారం అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు, స్క్రాప్ డీలర్లు, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్వాహకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 31, 2025 నుంచి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను పరిశీలించి జనవరి 9న జిల్లా స్థాయి కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. స్వఛ రథం ఆపరేటర్లుగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం మూడు సంవత్సరాల పొడి చెత్త లేదా స్క్రాప్ నిర్వహణ అనుభవం కలిగి ఉండాలని, చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని వివరించారు. దరఖాస్తులను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయం, విశాఖపట్నంలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రతి మండలాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి, ఒక్కో యూనిట్‌కు విడిగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థుల్లో అత్యల్ప వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోట్ చేసిన అభ్యర్థిని సంబంధిత మండలానికి స్వఛ్ఛ రథం ఆపరేటర్‌గా ఎంపిక చేస్తామన్నారు. ఈ విషయంలో జిల్లా స్థాయి కమిటీదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం పార్లమెంటరీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికలు జనవరి 26వ తేదీన జరుగుతుందని, జనవరి 7 నుండి అధ్యక్ష ఎన్నికకు జిల్లా పార్టీ కార్యాలయంలో దరఖాస్తు స్వీకరణ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అబ్జర్వర్, ఉత్తరాంధ్ర జోనల్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ దేన్నీస్ థామస్ కుమార్ తెలిపారు. విశాఖ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ సమావేశం బుధవారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల దృష్ట్యా బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ప్రారంభించారు, ఆమె మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ యువతకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాబోయే యువజన కాంగ్రెస్ ఎన్నికల కోసం ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన వారందరూ కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం తీసుకొని, పార్టీ బలోపేతానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాలని ప్రియాంక పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శివ కుమార్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాండవ గాయత్రి, యూత్ కాంగ్రెస్ జిల్లా కోఆర్డినేటర్ భారత్, సీనియర్ నాయకుడు కస్తూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయండి

సిఐటియు అఖిల భారత మహాసభ తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2026 ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక తీసుకున్న నిర్ణయానికి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 18వ అఖిల భారత మహాసభ పూర్తి మద్దతు ప్రకటించింది. ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక కోడ్‌లను బలవంతంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తే, కార్మికులు రాబోయే రోజుల్లో బహుళ రోజుల సార్వత్రిక సమ్మెతో ప్రతిఘటిస్తారు అని పేర్కొంది. కార్మిక కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చింది. ఎయు కాన్వకేషన్ హాల్ లో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరుగుతున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభలో ప్రారంభ రోజు బుధవారం రెండు తీర్మానాలను మహా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. లేబర్ కోడ్ లతో పని గంటలను పొడిగించడం, వృత్తిపరమైన భద్రతను నీరుగార్చడం, తనిఖీలను రద్దు చేయడం, కార్మిక తీర్పును బలహీనపరచడం, యజమానుల కార్మిక చట్టాల ఉల్లంఘనలను నేరరహితం చేయడం, కార్మికుల పోరాటాలను అణచివేయడం తీవ్రతరం చేస్తాయని ఆందోళన వ్యక్తంచేసింది. కార్మిక చట్టాల ప్రయోజనాలపై కార్మికులు, సామాన్య ప్రజలను తప్పుదారి పట్టించడానికి మోసపూరిత ప్రచారంలో వందల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తోందని తెలిపింది. ప్రజల రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు, స్వయంప్రతిపత్తి సంస్థలపై, సమాఖ్యవాదంపై దాడులు, పాలక వర్గం నయా ఫాసిస్ట్ పాత్రలను ప్రదర్శించడం, మతతత్వ, విభజన ఉద్వేగాలను రెచ్చగొట్టి శ్రామిక ప్రజల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు అన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించడానికి పాలక వర్గాలు చేస్తున్న ప్రయత్నాలలో భాగమేనని పేర్కొంది. ప్రజల హక్కులు, జీవనోపాధి, జాతీయ ఆర్థిక వ్యవస్థపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాన్ని మరింత ఉధృతం చేసే ప్రక్రియలో, తమ హక్కులు, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని తెలిపింది.

96వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రతి ఒక్కరికి నివసించేందుకు గృహం కల్పించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెందుర్తి జోన్ 96 వార్డు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన వారికి ఇల్లు పట్టాలను అందించారు. నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ప్రత్యేకంగా సమాజంలో ఆర్థికంగా బలహీన వర్గాల వారికి సొంత ఇల్లు నిర్మించుకునేందుకు స్తోమత లేని వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు కట్టుకునేందుకు అందరికీ అందుబాటు ధరలో ఇల్లు నిర్మాణ పథకం అందిస్తుందని తెలిపారు. ఈ పథకంలో భాగంగా పెందుర్తి జోన్ 96 వార్డులో అర్హులైన 82 కుటుంబాలకు ఇల్లు నిర్మాణ పత్రాలను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, సచివాలయం కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజా సంక్షేమం గాలికి..

వైసీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పీఎం పాలెం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని వైసీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. మధురవాడ లా కాలేజ్ రోడ్డు వైసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శల జల్లు కురిపించారు. వైసీపీ హయాంలో లక్షలాది పెన్షన్లు అందిస్తే, నేడు కూటమి ప్రభుత్వం సుమారు 6 లక్షల పెన్షన్లలో కోతలు పెట్టిందని మండిపడ్డారు. గత 18 నెలలుగా కొత్త వితంతు పెన్షన్ల ఊసే లేదన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న హామీని విస్మరించారని, 'బంగారు కుటుంబం' వంటి పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని, మధ్యాహ్న భోజన పథకం అస్తవ్యస్తమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలు, నేరాలు పెరిగిపోయాయని, మహిళల రక్షణ కోసం ఉన్న 'దిశ' యాప్‌ను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సింహాచలం, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాల విషయంలో భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారని, భీమిలిలో సాఫ్ట్‌వేర్ భూములను కట్టబెడుతున్నారని మజ్జి ఆరోపించారు. ఈ సమావేశంలో 4వ వార్డ్ కార్పొరేటర్ డి. కొండబాబు, 5, 6, 8 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, పోతిన ప్రసాద్, గుడ్ల పోలిరెడ్డి, బొట్ట అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 54 మంది ఉద్యోగ విరమణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ పి ఎమ్.సత్యవేణి పేర్కొన్నారు. బుధవారం ఆమె మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో వివిధ హోదాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులను జీవీఎంసీ అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్.ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి ఈ ఎన్ వి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీరు శ్రీనివాసరావు లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబము కంటే అధిక కాలాన్ని సంస్థ కొరకు పని చేశారని పేర్కొన్నారు. నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న డిడిహెచ్ దామోదరావుతోపాటు వివిధ హోదాలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న 54 మంది ఉద్యోగ విరమణ పొందారని, వారందరి శేష జీవితాలు ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్లు చేతుల మీదుగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ సుమారు రూ. 43,02,940 రూపాయలను అందించి పూలమాలలతో సత్కరించి, నూతన వస్త్రాలను, జ్ఞాపికలతో అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి సూపరింటెండెంట్ లు రియాజ్, సన్యాసిరావు, శ్రీనివాసరావు, జెమ్స్ యూనియన్ నాయకులు, జివిఎంసి ఉద్యోగులతో పాటు మాజీ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పనులు పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95వ వార్డు, పాపయ్యరాజుపాలెం నుండి లక్ష్మిపురం వరకు గల రోడ్డుకిరువైపులా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పనులను స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు బుధవారం ఉదయం పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా పాపయ్యరాజుపాలెం నుండి లక్ష్మిపురం రోడ్డు వరకు రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. దీంతో కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రత్యేక చొరవ చూపి జీవీఎంసీ నిధులు 120 లక్షల నిధులు మంజూరు చేయించి తారురోడ్డు వేయించారు. దీంతో రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. అయితే ఆ రోడ్డులో విద్యుత్ సదుపాయం లేకపోవడంతో చీకటిలో ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రజల అభ్యర్థన మేరకు సమస్యను గుర్తించిన కార్పొరేటర్ దేముడు, జీవీఎంసీ నిధులు 12 లక్షలు రూపాయలతో పాపయ్యరాజుపాలెం బంగారమ్మ దుర్గాలమ్మ,అమ్మవారి ఆలయాలు నుండి లక్ష్మిపురం వసంత గార్డెన్ వరకు నూతనంగా ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో అక్కడ జరుగుతున్న ఎలక్ట్రికల్ పోల్స్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ దేముడు విద్యుత్ శాఖ సిబ్బందితో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ సందరరేగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ రోడ్డు మార్గంలో సుమారుగా ప్రతిరోజు వందలాది మంది ప్రయాణించడంతోపాటు, చుట్టుప్రక్కల గ్రామాల నుండి ఉదయం సాయంత్రం మహిళలు,పురుషులు, సీనియర్ సిటిజన్స్ వాకింగ్ చేస్తున్నారని,వారి అభ్యర్థన మేరకు ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేయడమే కాకుండా,వాటికి వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇవే కాకుండా వార్డులో జన నివాసాలు ఉండి చీకటి మయంతో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలో వందలాదిగా ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేసి వాటికి వీధి దీపాలు ఏర్పాటు చేసామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి 95,97వ వార్డుల ఉపాధ్యక్షులు పిడివి ప్రసాద్,టిడిపి 95వ వార్డు ఉపాధ్యక్షులు కంచిపాటి హరినాథ్, బిజెపి 95,97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, కూటమి నాయకులు ఆడారి సన్యాసి రావు,చిట్టిబోయిన అంజి,మళ్ళ ధనలక్ష్మి,కెవిఆర్.లక్ష్మి, చిట్టి భవాని, కాలనీల ప్రతినిధులు బాబురావు, నాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నూతన కమిటీ ఎన్నికలు సొంట్యాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికల సమావేశానికి ఏపీటీఎఫ్ పూర్వ కార్యదర్శి బి. వెంకటపతిరాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, భీమిలి పట్టణానికి చెందిన శ్రీనివాసం ఎన్నికల పరిశీలకులుగా హాజరై కౌన్సిల్ సమావేశాన్ని పర్యవేక్షించారు. ఈ ఎన్నికల్లో మండల ఏపీటీఎఫ్ నూతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా జి.గంగాధరుడు, ప్రధాన కార్యదర్శిగా పి.రమేష్, ఉపాధ్యక్షులుగా అప్పలనాయుడు, టి.నారాయణరావు, ఎల్. కొండాజీ, కార్యదర్శులుగా జి. అప్పారావు, వి. సుదీర్, ఎస్. అప్పన్నబాబు, ఎ. హసీనా, జిల్లా కౌన్సిలర్లుగా యూ. ఈశ్వరరావు, బి. ఈశ్వరరావు, పి. అప్పలనాయుడు, యు.కృష్ణ, బి.శ్రీనివాసరావు, పి.వరహమూర్తి, అకడమిక్ సెల్ కన్వీనర్లుగా ఎం.ఈశ్వరరావు, కె. శ్రీనివాసరావు, ఎస్. సూర్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా వి.అప్పాజీ, డి. శ్రీదేవి, సి. సాయి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రకళఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటపతిరాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ఏపీటీఎఫ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించాలి, పీఆర్సీ కమిటీని తక్షణమే నియమించాలి, అలాగే ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు.

ఏడాదిన్నర కాలంలోనే 80 శాతం హామీలు అమలు చేశాం

విశాలాంధ్ర - పెందుర్తి : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే 80 శాతానికి పైగా ఎన్నికల హామీలను నెరవేర్చామని ఏపీ ఆయిల్ సీడ్స్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, పెందుర్తి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గండి బాబ్జి పేర్కొన్నారు. పెందుర్తి టిడిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తొలి గంటలోనే పెన్షన్ మొత్తాన్ని పెంచడం, తల్లికి వందనం, స్త్రీ శక్తి, డీఎస్సీ, పోలీస్ రిక్రూట్మెంట్, అన్నదాత సుఖీభవ, దీపం సహా అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీలు అభివృద్ధి చేసి రాష్ట్రంలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటే వైసీపీ నాయకులు దాన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పిపిపి విధానం గురించి జగన్ సహా ఆ పార్టీ నాయకులకు అవగాహన లేదని ధ్వజమెత్తారు. కేంద్ర నిధులతో ఒక్క కాలేజీని కూడా పూర్తి చేయలేని జగన్, ఇప్పుడు మెడికల్ కాలేజీలు నిర్మాణం పూర్తవుతుంటే ఓర్వలేకపోతున్నారని బాబ్జి విమర్శించారు. కాగా గనిశెట్టి కనకరాజు, రాములను టిడిపి నుండి సస్పెండ్ చేయడం పట్ల మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు బాబ్జి సమాధానమిస్తూ తప్పుడు ఫిర్యాదుతో పార్టీ నాయకులు కొందరు ఆ చర్య చేపట్టినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఆ తర్వాత నిజానిజాలను టిడిపి అధిష్టానానికి నాయకులు తెలియజేశారని వెల్లడించారు. దీనిపై త్వరలోనే పరిస్థితులు సద్దుమణుగుతాయని బాబ్జి ఆశాభావం వ్యక్తం చేశారు కార్యక్రమంలో టిడిపి నాయకులు అవగడ్డ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్‌లో స్కూల్ నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. పాఠశాల తల్లిదండ్రులు చేతులు మీదుగా భాస్కర్ విద్యానికేతన్ మరియు ఆర్ యస్ ప్లే స్కూల్‌కు సంబందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించి, తల్లిదండ్రులకు, విద్యార్థులకు, స్థానికులకు పంచి పెట్టి నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఆనందమయ జీవితం వుండాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల 8,9,10 వ తరగతి విద్యార్థులు కేక్ కట్ చేసి, పాటలు, డాన్సులతో నూతన సంవత్సర వేడుకలు సరదాగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర్ రావు ఆధ్వర్యం లో నిర్వహించగా సిబ్బంది శిరీష, శైలజ, హేమ, స్వాతి, అపర?, అనూష, లక్ష్మణ్, శంకర్, మోహన్ తదితరులు మరియు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంటుపల్లి పంచాయతీలో పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి వారి గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం పెన్షన్లు పంపిణీ కార్యక్రమం కూటమి నాయకులు ఆధ్వర్యంలో చేపట్టారు. గురువారం నూతన సంవత్సరం కావడంతో ఒక్కరోజు ముందుగానే బుధవారం ఉదయం నూతన పెన్షన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందరరేగా నాయకులు మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేస్తామని ఈ సందరరేగా తెలిపారు. కార్యక్రమంలో వేములవలస పిఎసిఎస్ చైర్మన్, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ మెంబర్ రౌతు నాగరాజు, తెలుగుదేశం పార్టీ పంచాయతీ మండల పార్టీ అధ్యక్షులు బంటుపల్లి గోవిందరావు (బుజ్జి), బంటుపల్లి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృతి స్కూల్ ఫేర్వెల్ వేడుకలు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం కొవ్వాడ గ్రామంలో సంస్కృతి స్కూల్ లో బుధవారం ఎంతో ఘనంగా ఫేర్వెల్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం మాట్లాడుతూ స్కూల్ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు అంచలంచెలుగా ఎదుగుతూ తమకంటూ ప్రత్యేకతను మంచి గుర్తింపును తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనలు, నృత్య ప్రదర్శనలు, నిర్వహించారు. స్నేహభావాన్ని గుర్తుచేసే అను భూతులను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయరామరాజు, డైరెక్టర్ సాయి కృష్ణరాజు, ప్రిన్సిపాల్ జగదీష్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన జోన్ 8 కమిషనర్ మనీషా త్రిపాటి

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును, జీవీఎంసీ జోన్ 8 అగనంపూడి జోనల్ కమిషనర్ మనీషా త్రిపాటి బుధవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారులతో కలిసి ఎమ్మెల్యేని కలిసిన జోనల్ కమిషనర్ పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జోనల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇంకా చేపట్టాల్సిన పనులు గురించి ఎమ్మెల్యేతో ఆమె చర్చించారు.

ట్వింకిల్ విద్యానికేతన్‌లో కొత్త సంవత్సరం వేడుకలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ట్వింకిల్ విద్యానికేతన్‌లో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిపారు. విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. విద్యార్థి విద్యార్థులు రంగురంగుల కాగితాలతో గ్రీటింగ్ కార్డులు తయారుచేసి పిల్లలు, టీచర్లకు పిల్లలకు పంచిపెట్టారు. ప్రిన్సిపల్ బి శాంతి కేకు కట్ చేసి పిల్లలకు టీచర్లకు పంచిపెట్టారు. పిల్లలు కు టీచర్లు చాక్లెట్లు పంచిపెట్టారు. రంగవల్లులతో వాకిళ్లు అలంకరించారు.

కార్మిక ఐక్య పోరాటాలతో బీజేపీని తరిమికొట్టాలి

సీటు జాతీయ మహాసభల్లో కార్మిక సంఘాల నేతలు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: పారిశ్రామిక, పర్యాటక నగరంగా ఉన్న విశాఖలో కార్మిక సంఘాల ఐక్యతను కోరుతూ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మిక లోకం ఏకం కావాలని సిఐటియు జాతీయ మహాసభల వేదికగా వివిధ కార్మిక సంఘాల నేతలు పిలువునిచ్చారు. బుధవారం విశాఖ బీచ్ రోడ్ లో గల ఏయూ కన్వెన్షన్ సెంటర్లో అనాథలావట్టం ఆనందన్ నగర్, కామ్రేడ్స్ ఎంఎం లారెన్సీ, బాసుదేబ్ ఆచార్య మంచ్‌లోని సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ఘనంగా ప్రారంభమైంది. దేశం బాగుండాలంటే, కార్మికుల ఐక్య పోరాటాలతో బిజెపిని తరిమికొట్టాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ పిలుపు నిచ్చారు. మహాసభలో ప్రవేశపెట్టిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి, లేబర్ కోడ్లను రద్దు చేయాలని తీర్మానాలు చాలా ముఖ్యమైనవని అన్నారు. ఈ తీర్మానాలకు ఎఐటియుసి మద్దతు ఉంటుందని తెలిపారు. కేంద్రంలోని ప్రధాని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, మహిళలు, మేథావులు, రచయితలపై దాడులను ముమ్మరం చేసిందని అన్నారు. దేశంలో బ్రిటిష్ వలసవాద, విభజించు పాలించు విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. నాడు బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేస్తే, నాడు జనసంఘ్, ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ విధానాలకు మద్దతు ఇచ్చారని విమర్శించారు. దేశంలో కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజల మధ్య చీలికలు తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. 1955-56లో ప్రభుత్వ రంగ, ప్రభుత్వ సర్వీస్‌లపై చర్చ జరిగినప్పుడు జనసంఘ్ వ్యతిరేకించిందని, ఇప్పుడు మోడీ సర్కార్ దాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగమన్నా, ప్రభుత్వ సర్వీస్ అన్నా ఈ ప్రభుత్వానికి గిట్టదని, అందుకే ప్రైవేటీకరణను వేగవంతం చేసిందని ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణ విధానాలపై కార్మిక సంఘాలు ఉధృత పోరాటం చేస్తోన్నాయని, అందుకే కార్మిక సంఘాలపై మోడీ సర్కార్ దాడి ప్రారంభించారని విమర్శించారు. అందులో భాగంగానే కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్లను తీసుకొచ్చారని అన్నారు. అయితే లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఐదు సమ్మెలు నిర్వహించాయని, కానీ గోడీ మీడియా, మోడీ మీడియా వాటిని కనీసం చూపించలేదని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు హక్కులు ఇస్తూ ఊడిగం చేస్తోన్నారని ధ్వజమెత్తారు.

కార్మికుల ఐక్య పోరాటాలే శరణ్యంః జయసేన్ మెహర్

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలే శరణ్యమని ఎఐయుటియుసి అఖిల భారత కార్యవర్గ సభ్యులు జయసేన్ మెహర్ అన్నారు. కార్మికులను ఐక్యం చేయడంలో కార్మిక సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, కార్మిక సంఘాల ఐక్యత మరింత బలపడాలని అన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికుల హక్కులను కాలరాసేందుకు నాలుగు లేబర్ కోడ్లను మోడీ సర్కార్ అమలు చేస్తుందని విమర్శించారు. ఫిబ్రవరి 12న జరిగే కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని అన్నారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును వెనక్కి తీసుకోవల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

కార్మికులకు చెడ్డ రోజులు.... కార్పొరేట్లకు మంచి రోజులుః జి.మధుసుదన్

మోడీ పాలనలో కార్మికులకు చెడ్డ రోజులు వచ్చాయని, కార్పొరేట్లకు మంచి రోజులు వచ్చాయని టియుసిసి కార్యవర్గ సభ్యుడు జి.మధుసుదన్ అన్నారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరిలో జరిగే సార్వత్రిక సమ్మె, మోడీ సర్కార్‌కు చెప్పుతో కొట్టే విధంగా ఉండాలని అన్నారు. ఆ స్థాయిలో విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మోడీ సర్కార్ హాయంలో కార్పొరేట్లకు అచ్చేదిన్ వచ్చిందని, సామాన్య ప్రజలకు కాదని అన్నారు. దేశంలోని 2 శాతం వ్యక్తుల ఆదాయం రూ.35 లక్షల కోట్లు పెరిగిందని, మరోవైపు ధరలు పెరిగి సామాన్య ప్రజల నడ్డి విరుగుతోందని అన్నారు. ఈ స్థాయిలో దేశంలో అసమానతలు ఉన్నాయని తెలిపారు.

కార్మికుల హక్కులకై పోరాట వేదికః సోనియా జార్జి

సైద్ధాంతికంగా, రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, కార్మికుల హక్కుల సాధన పోరాటానికి సిఐటియు అఖిల భారత మహాసభ వేదిక అయిందని ఎస్ఈడబ్ల్యుఎ ఉపాధ్యక్షురాలు సోనియా జార్జి అన్నారు. దేశంలో మతోన్మాద విధానాల అమలతో క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, ఈ నేపథ్యంలో కార్మికుల సమస్యలపై కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడుతున్నాయని అన్నారు. దేశంలో అసమానతుల పెరుగుదల ఎన్నడూ లేనంతగా ఉన్నాయని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటివి కూడా అందడం లేదని, మరోవైపు మహిళ కార్మికులు దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చలు చేసి, కార్మిక ఐక్య పోరాటాన్ని బలోపేతానికి కర్తవ్యాలుంటాయని భావిస్తున్నానని పేర్కొన్నారు.

కార్మికులపై ఎన్నడూ లేనంతగా దాడిః క్లిఫ్టన్ డి రోజారియో

దేశంలో ఎన్నడూ లేనంతంగా కార్మికులపై దాడి జరుగుతోందని ఎఐసిసిటియు ఉపాధ్యక్షులు క్లిఫ్టన్ డి రోజారియో అన్నారు. దేశంలో లేబర్ కోడ్లను అమలు చేసిన రోజు కార్మికులకు బ్లాక్ డే అని అన్నారు. కార్మికుల హక్కులు హరించే ఈ లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాజ్యాంగ ఇచ్చే సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును రద్దు చేసి, కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయాలని కుట్ర మోడీ సర్కార్ చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లతో సమ్మెపై నిషేధం విధిస్తారని, సంఘం పెట్టుకోవడానికి అడ్డంకులు సృష్టిస్తారని అన్నారు. మోడీ సర్కార్ కుట్రలను తిప్పికొట్టేందుకు కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులపై దాడిః సికె అప్పాస్వామి

మోడీ సర్కార్ ప్రైవేటీకరణ విధానాలతో కార్మికులపై సరికొత్త దాడికి దిగుతుందని యుటియుసి జాతీయ నేత సికె అప్పాస్వామి అన్నారు. ఇటీవలి పార్లమెంట్ శాంతి బిల్లు తీసుకొచ్చి అణుశక్తి రంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారని, దీనివల్ల దేశ భద్రత, కార్మికుల హక్కుల హననం జరుగుతాయని అన్నారు. మోడీ సర్కార్ వచ్చినప్పటి నుండి వివిధ కార్మికులపై దాడి చేస్తున్నారని, ఇప్పుడు లేబర్ కోడ్లతో కార్మికులపై దాడి తారాస్థాయికి చేరుకుందని అన్నారు. ఉపాధి హామీ రంగాన్ని కూడా నిర్వీరం చేసేందుకు బిల్లు ఆమోదించారని, దీంతో గ్రామీణ వ్యవసాయ కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. ఎల్‌పిఎఫ్ అధ్యక్షులు షణ్ముగమ్ అనివార్య కారణాలతో మహాసభకు హాజరుకాలేపోయారు. దీంతో ఆయన తన సందేశాన్ని మహాసభకు పంపిచారు. సిఐటియు అధ్యక్షురాలు కె.హేమలత ఆ సందేశాన్ని చదివి వినిపించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు చేద్దాం

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలను ఉధృతం చేయాలని, ఐక్యతకు పిలుపునిస్తూ సిఐటియు 18వ అఖిల భారత మహాసభలు విశాఖలో ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మక నగరమైన విశాఖపట్నంలో వర్గ ఐక్యత , ఉధృతమైన పోరాట స్ఫూర్తి కోసం శక్తివంతమైన పిలుపుతో ప్రారంభమైంది. అధ్యక్షురాలు కె. హేమలత సిఐటియు జెండాను ఎగురవేసి, అధ్యక్షురాలు హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ఇతర జాతీయ కార్యనిర్వాహకులు సోదర వర్గ , ప్రజా సంఘాల నాయకులతో కలిసి అమరవీరుల స్థూపానికి ఘనంగా పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. అల్లూరి, శ్రీకాకుళం , నెల్లూరు జిల్లాల నుండి కార్మికులు మోసుకెళ్ళిన మూడు అజేయమైన జ్యోతిలు - అమర జ్యోతిలు - రావడంతో సమావేశ వేదిక ఉత్సాహంగా మారింది, ఇవి వర్గ పోరాట జ్వాలలను సూచిస్తాయి. ప్రారంభ సమావేశం సాంస్కృతిక కళాకారులు ప్రదర్శించిన విప్లవాత్మక పాటలతో ప్రారంభమైంది, రాబోయే చర్చలకు ధిక్కార స్వరాన్ని ఇచ్చింది. రిసెప్షన్ కమిటీ తరపున, చైర్మన్ సిహెచ్. నరసింగరావు విశిష్ట అతిథులను , ప్రతినిధులను స్వాగతించారు, ప్రస్తుత పోరాటానికి ఈ ప్రాంతం యొక్క గొప్ప విప్లవాత్మక వారసత్వానికి మధ్య సమాంతరాన్ని చూపించారు. ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ అన్ని కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాన్ని , ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్‌ను స్వాగతిస్తూ మహాసభను ప్రారంభించారు. ఈ సమావేశంలో ప్రసంగిస్తూ, పాంబిస్ కిరిట్సిస్ ప్రగాఢ అంతర్జాతీయ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు, డబ్ల్యూ ఎఫ్ టి యు యొక్క 13వ ప్రపంచ కాంగ్రెస్ 2000లో న్యూఢిల్లీలో జరిగినప్పటికీ, రాబోయే 19వ ప్రపంచ కాంగ్రెస్ 2026 మేలో కొలంబోలో జరగనుందని పేర్కొన్నారు. భారత కార్మిక వర్గం , ఐక్య రైతు ఉద్యమాల కొనసాగుతున్న పోరాటాలను ఆయన గట్టిగా ఆమోదించారు, ముఖ్యంగా 2026 ఫిబ్రవరి 12న జరిగే కార్మిక వ్యతిరేక కార్మిక నియమావళికి వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇచ్చారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, ఐ ఎన్ టి యు సి జాతీయ సీనియర్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, హెచ్ఎంఎస్ ఆఫీస్ బేరర్ సభ్యుడు సుదర్శన్ రావు, ఏఐసీసీ టి యు ఉపాధ్యక్షుడు క్లిఫ్టన్ డి రోజారియో, ఏఐయు టి యు సి అఖిల భారత సెక్రటేరియట్ సభ్యుడు జయసేన్ మెహర్, యు టి యు సి ఆఫీస్ బేరర్ సభ్యురాలు షెకిజార్ అపసామి, ఎస్ ఇ డబ్ల్యు ఏ ఉపాధ్యక్షురాలు సోనియా జార్జ్ , టి యు సి సి ఆఫీస్ బేరర్ సభ్యురాలు జి. మధుసూదన్ వంటి అన్ని ప్రధాన కేంద్ర కార్మిక సంఘాల నాయకుల హాజరై తమ సౌర్య సందేశాన్ని అందించారు.